జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

TELTEL02057

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

E-Paper on click

శుక్రవారం

08.04.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్

సంపుటి - 01, సంచిక-45

పేజీలు - 4 వెల రూ. 5

aksharavelugudaily@gmail.com

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak



## ఒకరోజు ముందుగా ముగిసిన పార్లమెంట్

- ఉభయ సభలు నిరవధికంగా వాయిదా
- పలు కీలక బిల్లులను ఆమోదింపచేసుకున్న ప్రభుత్వం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు షెడ్యూల్ కంటే ఒక రోజు ముందే ముగిసిపోయాయి. 8న సమావేశాలు ముగుస్తాయని ప్రకటిం చినా ఒకరోజు ముందు పార్లమెంటు ఉభయ సభలు గురువారం నిరవధి, కంగా వాయిదా పడ్డాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 14న మొదలై షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 8 శుక్రవారం వరకు జరగాల్సి ఉండగా ఒకరోజే ముందే ముగిశాయి. ఈసారి బడ్జెట్ ఆమోదంతో పాటు కీలక బిల్లులైన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (సవరణ) బిల్లు, క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) బిల్లులకి పార్లమెంటు ఆమోద ముద్ర వేసింది. గురువారం సభ ప్రారంభమైన వెంటనే.. సమావేశాలను ముగిస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రకటించారు. రాజ్యసభలో మాత్రం చివరి రోజు కూడా విపక్షాల ఆందోళనలు కొనసాగాయి. ఛైర్మన్ వెంకయ్యనాయుడు.. సభ వాయిదా ప్రకటనను చదివే సమయంలో కాంగ్రెస్, శివసేన ఎంపీలు నినాదాలు చేశారు. భాజపా నేత కిరీటి సోమయ్య అక్రమ నిధుల మళ్లింపు విషయంపై చర్చ జరపాలని శివసేన డిమాండ్ చేయగా.. కాంగ్రెస్ అందుకు మద్దతు పలికింది. ధరల పెరుగుదలపై చర్చ జరపలేదని టీఎంసీ ఎంపీ డెరెక్ ఒబ్రియన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జనవరి 31న పార్లమెంట్

మిగతా 2వ

## దేశానికి గొడ్డలిపెట్టుగా హిందుత్వ కార్పోరేట్ విధానం

- దేశానికి గొడ్డలిపెట్టుగా హిందుత్వ కార్పోరేట్ విధానం
- గతం కన్నా వేగంగా సరళీకృత ఆర్థిక విధానాల అమలు
- ప్రభుత్వరంగ సంస్థలను యథేచ్ఛగా అమ్ముతున్న మోడీ
- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

**కన్నూరు, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** దేశంలో లౌకికత్వ పరిరక్షణ కోసం ఉధృతంగా.. రాజీలేని పోరాటాలు చేయటం ద్వారానే హిందూ మతోన్మాదానికి అడ్డుకట్ట వేయగలమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆరెస్సెస్ ఆదేశాలకు అనుగుణంగా మరింత దూకుడుగా హిందూత్వ అజెండాను అమలు చేస్తోందని తెలిపారు. అలాగే సరళీకృత ఆర్థిక విధానాలను గతం కన్నా రెట్టింపు వేగంతో అమలు చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదం, కార్పొరేట్ విధానాలను ఒక గొలుసులాగా కలిపి అమలు చేస్తోందని అన్నారు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంతో ప్రభుత్వరంగ సంస్థలను యథేచ్ఛగా అమ్ముతున్నదని తెలిపారు. అదే సమయంలో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ... దానికి పునాదులైన లౌకిక ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ, సామాజిక న్యాయం, ఆర్థిక స్వావలంబన అనే మౌలికాం శాలకు తూట్లు పొడుస్తున్నదని హెచ్చరించారు. రాజ్యాంగ సంస్థ లైన న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం, సిబిఐ, ఈడీ తదితరాలకు ఉన్న స్వతంత్రను భంగపరుస్తూ వాటిని తన అధీనంలోకి తెచ్చుకున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కన్నూరులో జరుగుతున్న సిపిఎం మహాసభల సందర్భంగా ఆయన తన అభిప్రాయాలను వెల్లడించారు. మరో వైపు అడ్డూ అదుపూ లేకుండా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ప్రజానీకంపై ఆర్థిక భారాలు నానాటికీ పెరిగిపో తున్నాయని ఏచూరి అన్నారు. ఐదు రాష్ట్రల ఎన్నికల అనంతరం... ఇప్పటివరకూ 14 సార్లు పెట్రో ధరలు పెరిగాయని గుర్తు చేశారు. కోవిడ్ కంటే ముందే దేశంలో ఆర్థిక సంక్షోభం మొదలైందనీ, కరోనా సమయంలో అది మరింత తీవ్ర రూపం దాల్చిందని తెలిపారు. ఒకవైపు దారిద్ర్యం, ఆకలి, నిరుద్యోగం తాండవిస్తుంటే మరో వైపు కార్పొరేట్లు, బడాబాబులు లక్షల కోట్ల సంపదను

మిగతా 2వ



మతోన్మాదం, కార్పొరేట్ విధానాలను ఒక గొలుసులాగా కలిపి బీజేపీ అమలు చేస్తోంది - సీతారాం ఏచూరి

## సిఎన్‌జి ధరలకు రెక్కలు

వరుసగగా రెండోరోజు పెరిగిన రేట్లు




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో సీఎన్‌జీ వాహనాలు వాడుదామని అనుకుంటే ఇప్పుడు దాని ధర కూడా పెరుగుతోంది. సీఎన్‌జీధరలు వరుసగా రెండోరోజు పెరిగాయి. ఢిల్లీలో సీఎన్‌జీ ధరలు కిలోకు రూ.2.50 పెరిగాయి. ఈ పెంపు తర్వాత ఢిల్లీలో సీఎన్‌జీ ధర కిలోకు రూ.69.11కి పెరిగింది. గత 2 రోజుల్లో, ఇందప్రస్థ గ్యాస్ లిమిటెడ్సీఎన్‌జీ ధరలను కిలోకు రూ. 5 పెంచింది. ఇది ఏప్రిల్‌లో ఇది మూడో పెంపు కాగా ఈ నెలలో మొత్తం కిలో రూ.9.10 పెరిగింది. సహజ వాయువు ధరల పెరుగుదల కారణంగా, ధరలను పెంచు తున్నాయి. ఏప్రిల్ 1న గ్యాస్‌పై ధర 80 పైసలు పెరిగింది. దీని తర్వాత ఏప్రిల్ 4న కిలోకు రూ.2.50 పెరిగింది. ఆ తర్వాత ఏప్రిల్ 6న దీని ధర రూ.2.50 పెరిగింది. ఎఉఒ గత నెలలో అఔఉ ధరలను కిలోకు 10 రూపాయలు పెంచింది. హైదరాబాద్‌లో రూ. 75.75 ఉండగా విజ యవాడలో రూ.74. 75 ఉంది. నోయిడా, గ్రేటర్ నోయిడా, ఘజి యాబాద్‌లలో కిలో ధర రూ.71.67గా ఉంది. ముజఫర్‌నగర్, మీరట్, షామ్లిలో రూ.76.34కు విక్రయి స్తున్నారు. గురుగ్రామ్‌లో సీఎన్‌జీ ధర కిలోకు రూ.77. 44కు పెరిగింది. కాగా పెట్రోల్, డీజిల్ ధరల్లో చమురు కంపెనీలు ఎలాంటి మార్పు చేయలేదు. దేశంలోని అతిపెద్ద చమురు మార్కెటింగ్ కంపెనీ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.10.5.41. కాగా లీటర్ డీజిల్ ధర రూ.96.67 గా ఉంది. హైదరాబాద్ లో లీటర్ పెట్రోల్ రూ. 119.49గా ఉండగా, డీజిల్ రూ. 105.49 వద్ద కొనసాగుతోంది. విశాఖపట్నంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 120 కాగా, డీజిల్ రూ. 105.65 వద్ద ఉంది.

## ఉద్రిక్తంగా కాంగ్రెస్ విద్యుత్ సౌధ ముట్టడి

ధర్నాలకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు ● మహిళా కాంగ్రెస్ నేతకు గాయాలు ● పోలీసుల తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

### ఆందోళనను అడ్డుకోవడం కాదు

- దమ్ముంటే విద్యుత్ చార్జీలు తగ్గించండి
- మాజీమంత్రి షబ్బీర్ అలీ డిమాండ్

2వ

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** తెలంగాణ కాంగ్రెస్ నేతలు చేపట్టిన విద్యుత్ సౌధ ముట్టడి ఉద్రిక్తతలకు దారి తీసింది. మహిళా కాంగ్రెస్ నాయకులను పోలీసుల్ని అడ్డుకోవడమే ఉద్రిక్తతలకు కారణమైంది. పోలీసులకు, కాంగ్రెస్ నేతలకు తోపులాట జరగడంతో కాంగ్రెస్ నాయకురాలు విద్యారెడ్డి కిందపడి పోయారు. దాంతో ఆమెకు గాయాలయ్యాయి. ఆమెను నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు తమ ఆందోళనను తీవ్రతరం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు.. గురువారం విద్యుత్ సౌద ముట్టడికి పిలుపునిచ్చారు విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని విద్యుత్ సౌధ సివిల్ సప్లై కార్యాలయాల ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, షబ్బీర్ అలీలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆపై హౌస్ అరెస్ట్ నుంచి బయటకు వచ్చిన వీరు విద్యుత్ సౌధ గేటు బయట నిరసన తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నేతల్ని మాత్రమే లోపలికి అనుమతించగా కాంగ్రెస్ కార్యకర్తలు గేటు బయట ఆందోళనకు దిగారు.






## గోయల్‌కు బలుపు.. కండకావరం

- మోడీని గద్దెదించే వరకు విశ్రమించం
- ఉప్పుడు బియ్యం ఎగుమతి చేస్తూ తీసుకోమంటారా
- మోడీ ఇచ్చిన హామీలు మరిచాడా
- సిరిసిల్ల ధర్నాలో మంత్రికెటిఆర్ ఘాటు విమర్శలు



**రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** తెలంగాణ ప్రజలను, రైతులను అవమానించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌పై టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. చాయ్ పే చర్చ అని అధికారంలోకి వచ్చిన బీజేపీని తరిమికొట్టడం ఖాయమని కేటీఆర్ తేల్చిచెప్పారు. తెలంగాణ ప్రజలకు నూకలు తినడం అలవాటు చేయాలని నోరు పారేసు కున్న గోయల్‌కు ఎంత

మిగతా 3వ

## వడ్ల కొనుగోళ్ల కోసం టిఆర్ఎస్ ఆందోళన

- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టిన శ్రేణులు
- ఎక్కడిక్కడే ధర్నాలో పాల్గొన్నమంత్రులు,ఎమ్మెల్యేలు
- సిరిసిల్ల సభలో కేంద్రంపై మండిపడ్డ మంత్రికెటిఆర్
- వికారాబాద్ ధర్నాలో పాల్గొన్న మంత్రి సబిత
- వరి కంకులను చేత పట్టి నిరసన
- ధర్నాలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- జాతీయ రహదారిపై ధర్నాలో మంత్రి ఇంద్రకరణ్
- కేంద్రం మెడలు వంచి ధాన్యం కొనిపిస్తాం
- రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదు
- జాతీయ రహదారిపై ధర్నాలో మంత్రి శ్రీనివాసగౌడ్




**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** వడ్ల కొనుగోళ్ల విషయంలో కేంద్రంతో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైన టీఆర్ఎస్ తన ఆందోళనలో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, సమావేశాలతో నిరసనలు తెలిపింది. రైతుల ఇండ్లపైనల్లజెండాలు ఎగురేసింది. తెలంగాణ రైతులు పండించిన వడ్లను కేంద్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. ఇప్పటికే అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టిన టీఆర్ఎస్.. బుధవారం రాష్ట్రంలో జాతీయ రహదారు లను దిగ్బంధించింది. ఇదే క్రమంలో గురువారం అన్ని జిల్లాల్లో రైతు మహాధర్నాలను చేపట్టింది. టీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2వ

## వరదసాయంలోనూ కేంద్రం వివక్ష

జాబితాలో తెలంగాణపేరు లేకపోవడం దారుణం

ట్విట్టర్ వేదికగగా మండిపడ్డ ఎమ్మెల్సీ కవిత

2వ

## ఐటి కంపెనీల్లో డ్రగ్స్ ప్రకంపనలు

13 మంది ఉద్యోగులపై వేటేసిన పలు కంపెనీలు

మరో 50మందికి నోటీసులు అందచేత

పోలీసుల జాబితాలో పేర్లు ఉండడంతో చర్యలు

## ఈడీ కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ

25కు విచారణ వాయిదా వేసిన హైకోర్టు

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** టాలీవుడ్ డ్రగ్స్ కేసులో ఈడీ కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు విచారణ నిర్వహించనుంది. సీఎస్ సోమేశ్ కుమార్, ఎక్సైజ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కరణ ఆరోపణలపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. కాల్ డేటా, డిజిటల్ రికార్డులు ఇవ్వడం లేదని ఈడీ ఆరోపించింది. హైకోర్టు

2వ

## గవర్నర్ వ్యవస్థను అవమానించిన తెలంగాణ ప్రభుత్వం

- వ్యక్తిగా తనకు గౌరవం అక్కర్లేదన్న తమిళసై
- ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసహనం
- వరుసగా రెండోరోజూ కొనసాగిన గవర్నర్ పర్యటన
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ





**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** ఢిల్లీపర్యటనలో ఉన్న తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వరుసగా రెండోరోజూ సంచలన కామెంట్స్ చేశారు. తనపై తెలంగాణ ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. ప్రొటోకాల్ పాటించడం లేదని.. వ్యక్తిగతంగా తనను అవమానించినా భరిస్తానని, కానీ వ్యవస్థకు గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.రాజ్ భవన్, గవర్నర్ ను కావాలనే అవమానిస్తున్నారని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నప్పటికీ, నన్ను బీజేపీ నేత అని ఎలా అనగల్గుతున్నారని ప్రశ్నించారు. అన్ని పార్టీల నేతలను కలిశాను. ఇంకా చెప్పాలంటే బీజేపీ నేతలను ఒకట్రెండుసార్లు మాత్రమే కలిశానన్నారు. ఏదన్నా ఉంటే నేరుగా

మిగతా 2వ

## షాంఘైలో విస్తరిస్తున్న కరోనా

వ్యక్తిగత స్వేచ్ఛపై ఆంక్షలు



**షాంఘై, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** కొవిడ్ వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో చైనా దేశంలోని ఆర్థిక కేంద్రమైన షాంఘై నగరంలో ప్రజలకు సంచలన హెచ్చరిక జారీ చేశారు. వ్యక్తిగత ప్రైవసీని దెబ్బతీసేలా ఆదేవాలు ఇచ్చింది. కలిసి నిద్రించ వద్దు, కౌగిలింతలు,

మిగతా 2వ

## రైతులను ఆదుకోకుండా ధర్నాలా?

కెసిఆర్‌పై మండిపడ్డ వైఎస్ షర్మిల

**ఖమ్మం, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** రైతుల కోసం కొట్లాడుతున్నానన్న సీఎం కేసీఆర్ కేంద్రం వద్ద ఎందుకు సంతకం పెట్టాడని వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల ప్రశ్నించారు. రైతు సంక్షేమమే ముఖ్యమైతే ఆరోజు సంతకం పెట్టకుండా ఢిల్లీలో ధర్నా ఎందుకు చేయలేదని నిలదీశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మ రైతు

మిగతా 2వ




పాదయాత్రలో భాగంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న షర్మిల

## ఎంఐఎం కార్పోరేటర్ తప్పు లేదన్న ఎసిపి

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** ఎంఐఎం పార్టీ కార్పొరేటర్ సోహైల్ కాద్రి ఘటనపై మీర్ చౌక్ ఏసీపీ ఆనంద్ వివరణ ఇచ్చారు. రెండు రోజుల క్రితం 5 వ తేదీన రాత్రి పూట యునాని ఆసుపత్రి వద్ద పార్కింగ్ విషయంపై ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లారన్నారు. కార్పొరేటర్ సోహైల్ కాద్రి పోలీసులు ఎందుకు వచ్చారని అడిగారన్నారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బందిని అడిగి జరిగిన విషయం తెలుసుకున్నారని ఏసీపీ తెలిపారు. అక్కడ

# సంపాదకీయం

## దేశభక్తి పేరుతో ఎందుకీ వంచన.. !

దేశభక్తికి నిర్వచనం ఏమిటి.. దేశభక్తి అంటే ప్రజలను పీల్చి పిప్పి చేయడమా...అన్నది తేలాల్సి ఉంది. ప్రజలంతా ఇప్పుడు ప్రధాని మాట్లాడుతున్న దేశభక్తిపై చర్చించాలి. దేశం కోసం ఇక్కడి ప్రజలు ప్రాణాలు ఇవ్వడానికి సిద్దంగా ఉన్నారు. కానీ అందుకు బిజెపి సిద్దంగా ఉందా లేదా తేల్చుకోవాలి. దేశభక్తితో పాలన చేయాలి కానీ ప్రజలను తిండికి లేకుండా, పనికి లేకుండా, ఆదాయం లేకుండా చేసి పన్నులతో, వడ్డింపుల తో చంపడం ఏ దేశభక్తో చెప్పాలి. దేశభక్తికి బీజేపీ ప్రతీక అని ప్రధాని మోదీ పేర్కొన్న తీరు చూస్తుంటే మిగతా వారికి దేశభక్తి లేదన్న అహంకారపూరిత తీరు కనిపిస్తోంది. దేశభక్తి అంటే దేశం గతంలో ఎన్నడూ ఎదుర్కొనని సమస్యలను ఎదుర్కోవడమా అన్న సందేహం కలుగుతోంది. ప్రత్యర్థి పార్టీలది కుటుంబ భక్తి అని ఎద్దేవా చేసే ముందు దేశభక్తి కలిగిన పాలకులు దేశం కోసం ఏంచేస్తున్నారో ఆత్మపరిశీలన చేసు కోవాలి. వారసత్వ పార్టీలు ప్రజాస్వామ్యానికి అతి పెద్ద శత్రువులని, ప్రజలు కూడా క్రమంగా దీనిని గ్రహిస్తు న్నారని మోడీ పార్టీ ఆవిర్భావం దినోత్సవం సందర్భం గా చేసిన ప్రసంగం మంచిదే అయినా.. ప్రజలకు ఏంచేస్తే మంచిదో కూడా చెబితే బాగుండేది. వారసత్వ పార్టీలు కుటుంబ పాలనకే అంకితం. రాజ్యాంగ విలువలంటే వాటికి లెక్కే లేదు. ఈ పార్టీలు వేర్వేరు రాష్ట్రాల్లో ఉన్నప్పటికీ తమ తమ అవినీతి, దుష్కృ త్యాలను కప్పిపుచ్చుకుంటుంటాయి. పైగా వాటి ఏలుబడిలో స్థానిక సంస్థల నుంచి పార్లమెంటు వరకు కొన్ని కుటుంబాలే ఆధిపత్యం చలాయిస్తాయి. నైపుణ్యం కలిగిన యువతను రాజకీయాల్లోకి రానివ్వడంలేదు. ఆయా పార్టీల అన్యాయాలు, దురాగతాలపై బీజేపీ కార్యకర్తలు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడుతున్నరని అంటూ మోడీ ప్రకటించారు. నిజానికి వారసత్వ రాజకీయాలను ప్రజలు కూడా స్వాగతించడం లేదు. అయితే బిజెపికి పట్టం కట్టిన ప్రజలకు ఇచ్చే సందేశం ఇదేనా అన్నది ఆలోచన చేయాలి. వరుసగా రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన మోడీ నోట్ల రద్దుతో తొలిసారిగా మోదారు. తరవాత జిఎస్టీతో దెబ్బ వేశారు.ఆ తరవాత పెట్రో ధరలతో వాతలు పెడుతున్నారు. ఇలా ప్రజలకు వాతలు పెట్టే బదులు ఖర్చులు తగ్గించడం,అనుత్పాదక పథకాలను ఎత్తేయడం గురించి ఎందుకు ఆలోచించడం లేదో చెప్పాలి. బిజెపి అధికారంలోకి వచ్చాక ఏ రంగమయినా బాగుపడిందా అంటే ఏదీ లేదనే చెప్పాలి. కేవలం పారిశ్రామిక వేత్తలను ఆదుకోవడం..వారు ఆస్తులు పెంచుకునేలా చేయడం తప్ప సామాన్యులు బాగుపడలేదు. ఆదానీ, అంబానీ లాంటి వారి ఆదాయాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వరంగ సంస్థలను వారికి అప్పనంగా కట్టబెడు తున్నారు. బ్యాంకులకు రుణాలు ఎగవేసిన వారు సుఖపడ్డారు. బీజేపీ నేతలు ప్రతీది దేశం కోసం.. ధర్మం కోసం అంటూ ఇంకా ప్రజలను మభ్యపెట్టాలని చూస్తే మంచిది కాదు. పెట్రోధరల పేరిట చేస్తున్న దోపిడీని సైతం దేశం కోసం.. దేశభక్తికోసమని నమ్మించే చర్యలను మోడీ మానుకుంటే మంచిది. ఇటీవల వరుసగా పెరుగు తున్న పెట్రోల్ ధరలపై పార్లమెంటులో ఎందుకు చర్చించలేదో చెప్పాలి. అంతర్జాతీయం గా చవక ధరలకు పెట్రో ఉత్పత్తులను కొని అధిక ధరలకు దేశ ప్రజలకు అమ్మే క్రమంలో వేస్తున్న సుంకాలను ఏమనుకోవాలి. పెరుగుతున్న పెట్రో ధరలతో కేంద్ర ప్రభుత్వం ఖజానా మాత్రమే నిండేలా చూసుకుంటున్నది. అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చినప్ప టి నుంచి సుంకాల రూపంలో కాకుండా సెస్‌ల రూపంలో పెట్రోరేట్లు పెరుగుతున్నాయని గుర్తించాలి. రోడ్స్ అండ్ ఇన్ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కోసం రూ.18, వ్యవసాయ, మౌలిక వసతులు అభివృద్ధి పేరిట రూ.2.50, ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీ పేరిట రూ.11..ఇలా ప్రతి దానికి ఒక్కో పేరు చెప్పి దేశచరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అత్యంత భారీగా రూ.30పైగా సెస్‌ల పేరుతో మోడీ సర్కార్ దోపిడీ చేస్తున్నది. ఇదేనా దేశభక్తి అంటే అన్నది మోడీ వివరించాలి. బిజెపి నాయకులు వివరించాలి. కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి దాదాపు పెట్రో ధరలను రెట్టింపు చేసింది. పెట్రో ధరల పేరిట పట్టపగలు ప్రజలను దోచుకుంటున్న బీజేపీది ఏ రకమైన దేశభక్తి అన్నది చర్చించాలి. అచ్చేదిన్ పేరుతో నీతిసూత్రాలు వల్లిస్తున్న మోడీ చేస్తున్న పాలన ప్రజలను బతుకడానికి అవకాశంలేకుండా చేస్తున్నది. బీజేపీ అవకాశవాద, అసమర్థ విధానాలను చూసిన తర్వాత మోడీపై ఉన్న భ్రమలు తొలగిపోయాయి. ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో గెలిపించిన పాపానికి.. ప్రజలకు మోడీ ఇచ్చిన రిటర్న్ గిఫ్ట్ అన్న బెంగాల్ సిఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు గమనార్హం. కేవలం పెట్రో ధరలను పెంచడాన్నే అలవాటుగా మార్చు కుందంటే అతిశయోక్తి కాదు. పెట్రో ధరలు ఎందుకు పెరుగుతున్నాయని అడిగిన ప్రతీసారి అంతర్జాతీయ పరిణామాలను బూచిగా చూపుతున్నారు. తాజా ధరల పెరుగుదలకు రష్యా, ఉక్రెయిన్ సంక్షోభాన్ని సాకుగా కేంద్ర మంత్రులు చూపిస్తున్నారు. లోక్‌సభలో దీనిపై చర్చకు ప్రధాని మోడీ రావడం లేదు. నిజానికి ఇన్నేళ్ల లో ఏ సమస్య పైనా బిజెపి చిత్తశుద్ధిగా చర్చకు రాలేదు. పార్లమెంట్ అంటేనే భయపడుతోంది.ప్రభుత్వ పరిపాలన అంటే ప్రజలపై భారీగా పన్నులు వసూలు చేయడమే అన్న స్ఫూర్తితోనే నరేంద్ర మోదీ సర్కార్ పనిచేస్తున్నట్టు కనిపిస్తోంది. ప్రజలను దోపిడీ చేయడమే లక్ష్యంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు పనిచేస్తుందనడంలో సందేహం లేదు. దేశంలోఉన్న వనరులను వినియోగించి సంపదను సృష్టించి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ.. సృష్టించిన సంపదను ప్రజలకు పంపిణీ చేయాల్సింది పోయి..దేశ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతున్న తీరు దారుణం కాక మరోటి కాదు. దేశంలో పాలన ఇలాగే కొనసాగితే శ్రీలంక లాగే ప్రజలు రోడ్డెక్కాల్సిన దుస్థితి రావచ్చు. కేవలం పన్నుల పేరిట ప్రజలను పీల్చిపిప్పి చేయడమే పరిపాలనగా భావిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపే రోజు తప్పకుండా వస్తుంది.

పృధ్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# రేవంత్ సహా కాంగ్రెస్ నేతల గృహనిర్బంధం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఆయన ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై తెలంగాణ కాంగ్రెస్ ధర్నాలకు పిలుపు ఇచ్చింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలను గృహ నిర్భందం చేసారు. గురువారం సివిల్ సప్లై భవన్, విద్యుత్ సౌధ ముట్టడికి కాంగ్రెస్ పిలుపు ఇచ్చింది. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుంచే కాంగ్రెస్ పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. ముఖ్య నేతల ఇళ్ల వద్ద పోలీసులు భారీగా మోహరించారు. వారు బయటకు వస్తే అరెస్టు చేయడానికి సిద్దంగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చమురు, గ్యాస్, విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ విద్యుత్ సౌధ, సివిల్ సప్లై కార్యాలయాల ముట్టడికి పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, మల్లురవి, దాసోజు శ్రవణ్, హర్కర వేణుగోపాల్, జక్క జడ్సన్, తదితరులను హౌస్ అరెస్ట్ చేశారు. ఇంధన ధరలతో పాటు విద్యుత్ ఛార్జీలుతగ్గించడం, యాసంగి ధాన్యం కొనుగోళ్లు చేసే దాకా కాంగ్రెస్ పోరాడుతుందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. విద్యుత్ సౌధ ముట్టడికి ఆయన పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. కాంగ్రెస్ శ్రేణులు ధర్నాలు చేయకుండా అడ్డుకోవడంపై రేవంత్ మండిపడ్డారు. టిఆర్ఎస్ రాస్తారెకోలు చేస్తుంటే పోలీసులు రోణ కల్పించి తమకేమో అడ్డంకులు సృషించడం దారుణమన్నారు. టిఆర్ఎస్ ద్వంద విధానాలను ఆయన ఎండగట్టారు

### గవర్నర్ వ్యవస్థను అవమానించిన
# తెలంగాణ ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి..)అడగండి, నేను సమాధానం చెబుతాను. అలాగే సీఎస్, డీజీపీ, ఇతర అధికారులను వచ్చి వివరణ ఇవ్వమనండి'అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గణతంత్ర వేడుకలకు, ఉగాది వేడుకలకు ఎందుకు రాలేదు..ఇదేనా మర్యాద? సీఎం సహా అందరినీ ఆహ్వానించానని గవర్నర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ మంచి పనుల్ని తాను అభినందించానని, పలు సూచనలు చేశానని చెప్పారు. గురువారం తెలంగాణ గవర్నర్ ఢిల్లీ పర్యటన రెండో రోజు కొనసాగింది. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్..గురువారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిశారు. తెలంగాణలో ప్రస్తుత నెలకొని ఉన్న పరిస్థితులను అమిత్‌షాకు వివరించారు. ఇందుకు సంబంధించి ఓ రిపోర్టును కూడా హోంమంత్రికి అందజేసినట్టు తెలుస్తోంది. అ సందర్భంగా ఆమె కామెంట్స్ రాజకీయాల్లో సంచలనంగా మారాయి. కేంద్ర మంత్రి అమిత్ షాతో గవర్నర్ తమిళి సై సమావేశం సుదీర్ఘంగా సాగింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు.. తెలంగాణ, పుదుచ్చేరి గురించి ఆయనతో చాలా అంశాలపై చర్చించాను.. ముఖ్యంగా తెలంగాణ పరిస్థితులను వివరించినట్లు గవర్నర్ తమిళి సై తెలిపారు. ఎప్పుడూ నిర్మాణాత్మకంగా ఆలోచిస్తాను. తెలంగాణ ప్రజల కోసమే పని చేస్తాను. నేను ఏది మాట్లాడినా ప్రజల కోసమే అన్నారు. ప్రజలకు మేలు జరిగేలా హోం మంత్రితో చర్చించామ న్నారు. ఎవరి సహకారం అందక పోయినా ముందుకు వెళ్తానని ఆమె తెలిపారు. తనకు ప్రభుత్వం సహకరించకపోయినా మేడారంరోడ్డు మార్గంలోనే వెళ్లానని చెప్పారు. భద్రాచలం కూడా అలాగే వెళతానని అన్నారు. తెలంగాణ పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిందే. తెలంగాణలో ఏం జరుగుతుందో తెలిసిందేనన్నారు. గవర్నర్ ను ఎందుకు అవమానిస్తున్నారో తెలంగాణ వాసులే తెలుసుకోవాలన్నారు. మేడారం వెళితే అధికారులు ఎందుకు రాలేదని గవర్నర్ ప్రశ్నించారు. తెలంగాణ గవర్నర్ పర్యటించాలంటే రోడ్డు మార్గమే దిక్కని అన్నారు. శ్రీరామనవమి ఉత్సవాలకు భద్రాచలం వెళతానని చెప్పారు. యాదాద్రికి వెళితే ఒక్క అధికారి రాలేదన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు జరిగేలా హోంమంత్రితో చర్చించానని అన్నారు. అయితే అమిత్ షాతో ఏం చర్చించానో బయటకు చెప్పలేనని అన్నారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసమే ఎప్పుడూ ఆలోచిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో ఏం జరుగుతుందో అందరికీ తెలుసని, తనకి ఎవరి నుంచి సహకారం అందినా, అందకపోయినా పాజిటివ్‌గా ముందుకెళ్తానని తెలిపారు. మేడారం వెళ్లినప్పుడు ప్రోటోకాల్ పాటించలేదని నేను చెప్పలేదని, సీతక్క చెప్పారన్నారు. యాదాద్రిలో తనకు మర్యాద ఇవ్వలేదని మీడియా రాసిందే కానీ తాను అనలేదన్నారు. అసలు వాళ్ల అభ్యంతరాలు తనకు చెబితే తాను సమాధానం చెబుతానని, ఇలాంటి ఘటనలు సమంజసం కాదని అన్నారు. ఉగాది ఉత్సవాలకు తాను పిలిస్తే ప్రభుత్వం నుంచి ఎవరూ రాలేదని, ఇదేం మర్యాదని గవర్నర్ ప్రశ్నించారు. రెండేళ్లలో బీజేపీ నాయకుల్ని కేవలం ఒకటి రెండు సార్లే మాత్రమే కలిశానని ఆమె చెప్పుకొచ్చారు.

## వడ్ల కొనుగోళ్ల కోసం టిఆర్ఎస్ ఆందోళన

(మొదటి పేజీ తరువాయి..)ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతులు,టీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసనల్లో పాల్గొన్నారు. కేంద్రంలోని మోదీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలుచోట్ల మోదీ దిష్టి బొమ్మలను దహనం చేశారు. కేంద్రం వడ్లను కొనుగోలు చేసే వరకు ఉద్యమం ఆగదని నేతలు నినదిం చారు. ఈ ఆందోళనలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే,స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసనలు కొనసాగించారు. ఇదిలావుంటే ధర్నాల్లో కేవలం టిఆర్ఎస్ నేతలు, కార్యకర్తలే కనిపించారు. ఎక్కడా రైతులు కానరాలేదు. రైతుల కోసం టీఆర్ఎస్ నేతలు పోరాడుతున్నా.. వారి నుంచి మద్దతు రాకపోవడంపై పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలుపై కేంద్ర ప్రభుత్వం వైఖరికి నిరసనగా రెండు రోజులుగా టీఆర్ఎస్ పార్టీ ఆందోళనలు కొనసాగుతున్నాయి. కేంద్రం తెలంగాణపై కక్ష్య పూరితంగా వ్యవహరిస్తోందని మంత్రులు ఆరోపణలు గుప్పించారు. కేంద్రం దిగివచ్చేంతవరకు తమ నిరసనలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. టీఆర్ఎస్ ఆందోళనల్లో రైతులు కనబడకపోవడం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తెలంగాణలో పండిన యాసంగి ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని టీఆర్ఎస్ మరోసారి డిమాండ్ చేసింది. వడ్లు కొనకుండా రైతులను ఆగం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించింది. వడ్లు కొంటామని ఒకరు, కొనబోమని మరొకరు.. నూకలు తినాలని ఇంకొకరు.. తెలంగాణ ప్రజలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు పిలుపు మేరకు పార్టీ శ్రేణులుగురువారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేశారు. వడ్ల కుప్పలు, వరి గొలుసులతో రైతులు తరలివచ్చి కేంద్రం తీరుపై ధ్వజమెత్తారు. అనేక చోట్ల టీఆర్ఎస్ శ్రేణులు, రైతులు స్వచ్ఛందంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రైతు బతుకులతో చెలగాటం', దేశం కోసం ధర్మం కోసం వడ్లు కొనాలి' అంటూ నినదించారు. రైతులు ఎడ్లబండ్లపై ర్యాలీగా వచ్చి హైవేలను ముట్టడించారు. తెలంగాణ రైతు బతుకుల్లో చీకటి నింపేలా కుట్రలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై గులాబీ శ్రేణులు నిప్పులు చెరిగాయి. ధాన్యం కొనబోమన్న కేంద్రంపై ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో టీఆర్ఎస్ మహా ధర్నా కార్యక్రమాలు చేపట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సిరిసిల్లలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రులు తమ జిల్లాల్లో పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల బాధ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్రంలో ఉన్నది తెలంగాణ రైతు పండించిన పంటను కొనలేని దద్దమ్మ ప్రభుత్వం అని మంత్రి కెటిఆర్ విమర్శించారు. . రైతుల కోసం కేంద్రం చేసిందేమిటో ఒక్కటి చెప్పాలి. వడ్లు కొంటామని ఒకరు, కొనబోమని మరొకరు.. నూకలు తినాలని ఇంకొకరు.. తెలంగాణ ప్రజలతో చెలగాటం ఆడుతున్నారు. నూకలు తినాలన్న బీజేపీ వాళ్లకు నూకలు చెల్లిపోయాయి. రైతులను బీజేపీ సర్కారు ఏనాడూ పట్టించుకోలేదు. యువతకు, పేదలకు సైతం చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైన తెలంగాణ రైతన్న, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ హయాంలో ఉచిత నిరంతర విద్యుత్తు, పుష్కలంగా సాగునీటితో మంచి పంటలు పండి స్తుంటే, కేంద్రం మాత్రం రైతుల ధాన్యం కొనబోమంటూ వారికి అన్యాయం చేస్తున్నదని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఉచిత విద్యుత్తు ఇస్తుంటే.. మోదీ మాత్రం మోటర్లకు మీటర్లు బిగించాలం టున్నారు. దేశమంతా కేసీఆర్‌ను కోరుకొంటే తమ గతి ఏం కావాలని బీజేపీ నేతలు భయప డుతున్నారు. తెలంగాణ పట్ల ప్రధాని మోదీ ఆది నుంచి నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని మంత్రి అన్నారు. కేంద్ర మంత్రి గోయల్ రాష్ట్ర ప్రజలను అవమానించేలా నూకలు తినడం అలవాటు చేయమని చెప్పడం ఆయన అహంకారం ధోరణికి నిదర్శన అని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో రెండు పంటలు కొనుగోలు చేస్తున్న కేంద్రం, తెలంగాణ విషయంలో అన్యాయం చేస్తున్నది. రైతులను వరి సాగు చేయాలని చెప్పిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దమ్ముంటే కేంద్రం చేత వడ్లు కొనుగోలు చేయించాలన్నారు. వడ్ల కొనుగోళ్ల విషయంలో కేంద్ర మంత్రి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు. బాయిల్డ్ రైస్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తూ ఈ బియ్యం ఎవరూ కొనడం లేదని దగాకోరు మాటలు మాట్లాడుతున్నారు. కేంద్రం మెడలు వంచి వడ్లను కొనిపిస్తామన్నారు. కేంద్రం మెడలు వంచైనా ధాన్యం కొనిపిస్తాం. అన్నదాతల కోసం రాజీలేని పోరాటం చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ కరీంనగర్‌లో అన్నారు. ధాన్యం కొనుగోలులో కేంద్రం పంజాబ్‌లో ఒకలా, తెలంగాణలో మరోలా వ్యవహరిస్తున్నది. సీఎం కేసీఆర్ పెట్టుబడి సాయం, 24 గంటల ఉచిత విద్యుత్తు, సాగునీరు అందించడంతో రైతులు పండించిన పంటను తీసుకోకుండా, కేంద్రం రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నది. 20 ఏండ్లుగా ఎట్లా కొంటున్నరో ఈ సారి కూడా అలాగే కొనాలి. లేకుంటే ఢిల్లీకి వచ్చి కేంద్రం, బీజేపీ నేతల ముఖాన ధాన్యాన్ని కుమ్మరిస్తామని అన్నారు.

### వరదసాయంలోనూ కేంద్రం వివక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ పక్షపాత వైఖరిని ట్విట్టర్ వేదికగా టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి ఎండగట్టారు. 2021-22 సంవత్సరానికి ఆయా రాష్ట్రాలకు కేటాయించిన వరద సాయం నిధుల జాబితాను ఎన్డీఆర్ఎఫ్ రెండు రోజుల క్రితం విడుదల చేసింది. ఆ జాబితాలో తెలంగాణ పేరు లేకపోవడాన్ని కవిత ప్రస్తావించారు. దీంతో ఆ జాబితాను తన ట్విట్టర్ ఖాతాలో ఆమె షేర్ చేస్తూ.. బీజేపీ పక్షపాత వైఖరిపై మండిపడ్డారు. హైదరాబాద్ ప్రజలకు వరద సాయం అందించడంలోనూ బీజేపీ ప్రభుత్వం పూర్తిగా వివక్ష చూపుతుందని కవిత నిప్పులు చెరిగారు. హైదరాబాద్ వరదల సమయంలో సీఎం కేసీఆర్ బాధితులకు అన్ని రకాలుగా అండగా ఉన్నారన్న ఎమ్మెల్సీ కవిత, కేంద్ర ప్రభుత్వం ఎన్నడూ ఆదుకోలేదని పేర్కొన్నారు. ప్రతి అంశంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై చూపుతున్న వివక్షపూరిత వైఖరితో మనసు కలచి చేస్తోందని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 2021-22 లో అనేక రాష్ట్రాలను ఎన్డీఆర్ఎఫ్ నిధులు మంజూరు చేసిన కేంద్రం, తెలంగాణకు మాత్రం ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. తెలంగాణ ప్రభుత్వం వరద బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేసి ఆదుకొన్నది. వరద బీభత్సంతో అల్లాడిపోయిన తెలంగాణకు రూ.1,350 కోట్ల తక్షణ సాయం, మొత్తం రూ.5 వేల కోట్ల ఎన్డీఆర్ఎఫ్ నిధులివ్వాలని సీఎం కేసీఆర్ ప్రధానమంత్రికి గతంలోనే లేఖ రాశారు. కానీ ఇప్పటిదాకా కేంద్రం నుంచి నయాపైసా రాలేదు.

# ఐటి కంపెనీల్లో డ్రగ్స్ ప్రకంపనలు

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన డ్రగ్స్ కేసులో..వాటిని తీసుకున్న ఐటీ ఉద్యోగులపై వేటు పడింది. 13 మంది ఉద్యోగులను ఐటీ కంపెనీలు తొలగించాయి. మరో 50 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు నోటీసులు అందజేశాయి. పోలీసులకు పట్టుబడ్డ డ్రగ్స్ పెడ్లర్ల వద్ద సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల చిట్టా లభ్యమైంది. సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌కు పెడ్లర్లు డ్రగ్స్, గంజాయి అమ్మినట్లు పోలీసుల విచారణలో తేలింది. అమెజాన్, ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, మహేంద్ర, క్యూసాఫ్ట్ కంపెనీలకు చెందిన ఉద్యోగులను పోలీసులు పట్టుకున్నారు. ప్రేమ్‌కుమార్, టోనీ, లక్ష్మీపతిల నుంచి డ్రగ్స్, గంజాయిని కొనుగోలు చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పార్టీలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇలా జాబితాలో పేర్లు ఉండడంతో డ్రగ్స్ తీసుకున్న ఐటీ ఉద్యోగులపై వేటు పడింది. డ్రగ్ తీసుకున్నట్లు తేలిన 13 మంది ఉద్యోగులను ఐటీ కంపెనీలు తొలగించాయి. సాఫ్ట్‌వేర్లకు డ్రగ్స్ అమ్మినట్టు తేలడంతో పోలీసులు కంపెనీలకు లేఖలు రాశాయి . వీకెండ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు డ్రగ్స్ పార్టీలకు వెళు తున్నారని..పోలీసులు పక్కా నిఘాతో వీరిని పట్టుకున్నారని తెలుస్తోంది.హైదరాబాద్ డ్రగ్ కేసులు, పబ్ లింక్‌ల్లో దారులన్నీ వైజాగ్ వైపే కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో అరకు లోయలో హైదరాబాద్ నార్కోటిక్ వింగ్ సోదాలు చేపట్టింది. నిన్న సురేష్, నరేష్ అనే ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు ఏపీ పోలీసులు. హైదరాబాద్‌లో బీటెక్ కుర్రాడి చావుకు కారణమైన లక్ష్మిపతి గ్యాంగ్‌తోనూ వీరికి లింక్‌లున్నాయి. నరేష్‌కు తెలుగు రాష్ట్రాల్లో అనేక లింక్‌లు ఉన్నాయి. అరకు నుంచి హైదరాబాద్‌కు హాష్ ఆయిల్ సప్లై అవుతుంది. గంజాయి నుంచి తయారౌవుతున్న హాష్ ఆయిల్‌కు యూత్‌లో భారీ డిమాండ్ ఉంది. హాష్ ఆయిల్ ట్రాన్స్‌పోర్ట్ చాలా సులభంగా చేయచ్చన్నది ఆ వ్యాపారంలో ఆరితేరిన వారి అనుభవం చెప్తోంది. హాష్ ఆయిల్ కోసం రెండు రాష్ట్రాల్లోవేలల్లో కస్టమర్లు ఉన్నట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. కేజీ హాష్ ఆయిల్ 5 లక్షలు రూపాయలు. సిగరెట్‌లకు హాష్ ఆయిల్ రాసుకుని మత్తులోకి జారుతోంది యువత. డ్రగ్స్ చైన్ గుట్టు మొత్తం రట్టు చేసే పనిలో ఉన్నారు పోలీసులు. మరోవైపు పుడింగ్ పబ్ కేసులో పరారీలో ఉన్న కిరణ్ రాజ్, అర్జున్‌పై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. నిందితులు విదేశాలకు పారిపోకుండా బంజారాహిల్స్ లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే అనిల్, అభిషేక్‌ను అరెస్ట్ చేశారు. పుడింగ్ పబ్ నుంచి ఇద్దరు పోలీస్ అధికారులకు వాటాలు వెళ్తున్నట్లు ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. పబ్‌లో రోజూ డ్రగ్స్ సరఫరా అయినట్లు పోలీసులకు ఆధారాలు లభించాయి. అభిషేక్, అనిల్ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి కస్టమర్లకు సమాచారం ఇచ్చినట్లు గుర్తించారు. డ్రగ్స్ ఎక్కడి నుంచి తెస్తున్నారనే దానిపై ఆరా తీస్తున్నారు.

# ఆందోళనను అడ్డుకోవడం కాదు



**కామారెడ్డి, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** టిఆర్ఎస్ ఆందోళనలకు పోలీసులు కొమ్ముకాస్తూ, కాంగ్రెస్ చేస్తున్న ఆందోళనలను అడ్డుకోవడం దారుణమని కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. టిఆర్ఎస్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందదుకు కాంగ్రెస్ చేస్తున్న ఆందోళనలను అడ్డుకుంటోందని అన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే వడ్ల రాజకీయం చేస్తోందని అన్నారు. కాంగ్రెస్ ఉద్యమాలకు ప్రజల్లో వస్తున్న మద్దతు చూసే టీఆర్ఎస్ అడ్డుకునేందుకు యత్నిస్తోందన్నారు. పార్లమెంట్ సమావేశాలు ముగుస్తుంటే 11న ధర్నా చేస్తామని ప్రకటించడం హస్యాస్పదం అన్నారు. పెంచిన నిత్యావసర వస్తువుల ధరలను పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్నాయని అన్నారు. బుధవారం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి కేంద్రం ధరల పెరుగుదలకు కారణమైతే, వడ్ల కొనమంటూ రాష్ట్రప్రభుత్వం రైతులను అయోమయానికి గురి చేస్తుందన్నారు. వరి ధాన్యం కొనేంత వరకూ కాంగ్రెస్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. అలాగే వరిధాన్యం కొనుగోలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటూ మధ్యలో రైతులను నిండముంచుతున్నాయని షబ్బీర్‌అలీ అన్నారు. 2021 లో బాయిల్డ్‌రైస్ ఇవ్వమని ఒప్పందంపై సీఎం కేసీఆర్ పెట్టిన సంతకం రైతుల పాలిట మరణశాసనంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో 40లక్షలలో రైతులు వరి పంటను పండించారని 80లక్షల క్వింటాళ్లలో పంటపండితే 30లక్షల క్వింటాళ్ల బియ్యం స్థానికంగా అవసరం ఉండగా, 50లక్షల క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు కోసం రూ.10వేల కోట్ల ఖర్చు అవుతాయన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యా న్ని ఎఫ్‌సీఐకి తిరిగి ఇవ్వటం ద్వారా రాష్ట్రానికి రూ.12వేల కోట్లు వస్తాయని తెలిపారు. కేసీఆర్ కుటుంబానికి రైస్ మిల్లర్లకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు దళారుల దగాకు గురవుతున్నారని, కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు, మిల్లర్లపై పీడీయాక్ట్, క్రిమినల్ కేసులు నమోదు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

### ఒకరోజు ముందుగా
# ముగిసిన పార్లమెంట్

(మొదటి పేజీ తరువాయి..) బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండు విడతల్లో సమావేశాలు నిర్వహించారు. తొలి విడత ఫిబ్రవరి 11న ముగిసింది. మొదటి దశ సమావేశాల్లోనే బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. కొద్దిరోజుల విరామం తర్వాత ఉభయ సభలు.. మార్చి 14న రెండో విడత కోసం సమావేశమయ్యాయి. ఏప్రిల్ 8 వరకు ఈ సమావేశాలు కొనసాగాల్సి ఉంది. ఈ సమావేశాల్లో కీలక బిల్లులను కేంద్రం ఆమోదించుకుంది.

## దేశానికి గొడ్డలిపెట్టుగా హిందుత్వ కార్పోరేట్ విధానం

(మొదటి పేజీ తరువాయి..) పోగేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కోవిడ్ సమయంలో ఇది మరింత నగంగా బయటపడిందన్నారు. ప్రజల గురించి పట్టించుకోని మోడీ సర్కార్... పెద్దలకు మాత్రం లక్షల కోట్ల మేర రాయితీలనిచ్చిందని వివరించారు. వామపక్షాల నాయకత్వంతో కూడిన పోరాటాలే మతోన్మాదానికి నిజమైన విరుగుడని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపిని ఒంటరిపాటు చేయటం, దాన్ని ఓడించటమనేవి ఇప్పుడు దేశానికి అత్యంత అవసరమని తెలిపారు. ఎన్నికల ద్వారానే ఆ పార్టీని ఓడించటమనేది కాకుండా రాజకీయ సైద్దాంతికతతో పాటు సామాజిక, సాంస్కృతిక రంగాల్లో కూడా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. ఇందుకోసం వామపక్షాలు, సిపిఎం తమ బలాన్ని పెంచుకొని పీడిత ప్రజల కోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సరళీకృత ఆర్థిక విధానాలకు ప్రత్యామ్నాయంగా ప్రజలకు ఉపయోగపడే విధానాలతో ముందుకెళుతున్నదని చెప్పారు. ఫలితంగా మానవాభివృద్ధి సూచికల్లో అగ్రగామిగా నిలిచి ప్రపంచం దృష్టిని తనవైపునకు తిప్పుకుందని ప్రశంసించారు.

## రైతులను ఆదుకోకుండా ధర్నాలా?

(మొదటి పేజీ తరువాయి..)వేదిక వద్ద ధర్నాలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ.. పిల్లిని చూసి ఎలుక దాక్కున్నట్లు ప్రధాని మోదీ తెలంగాణ రాష్ట్రం వస్తే కేసీఆర్ ఎదురుపడకుండా దాక్కున్నాడు. ఆనాడు సంతకం పెట్టి రైతులను బావిలో తోసి నిండా ముంచిన కేసీఆర్.. ఈ రోజు ఢిల్లీలో రక్షించండంటూ డ్రామాలు ఆడుతున్నాడు. ఖమ్మం జిల్లా మంత్రి ఎవరి మీద.. ఎందుకోసం ధర్నా చేస్తున్నారు? పరిపాలన చేతకాక, వడ్లు కొనడం చేతకాక టిఆర్ఎస్పార్టీ ధర్నాలు చేస్తోందని మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకుంది ప్రజల సమస్యలు పరిష్కరించాలని కానీ ధర్నాలు చేయడానికి కాదు. రైతు పండించిన పంట ఎందుకు కొనడం లేదని.. ధర్నాలు చేస్తే కేసీఆర్ మీద చేయాలి. తెలంగాణలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి పక్షాలు లేవు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకే వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఏర్పడిందని పేర్కొన్నారు.

### షాంఘైలో విస్తరిస్తున్న కరోనా

(మొదటి పేజీ తరువాయి..)ముద్దులు పెట్టుకోవద్దు... అంటూ లాక్‌డౌన్ విధించి షాంఘై నగరవాసులను హెచ్చరించారు. దీంతో సందడిగా ఉండే షాంఘై నగర వీధులు లాక్ డౌన్ ఆంక్షలతో ఖాళీగా కనిపిస్తున్నాయి. షాంఘై వీధుల్లో కేవలం ఆరోగ్య కార్యకర్తలు మాత్రమే కనిపిస్తున్నారు. కరోనా కట్టడి కోసం షాంఘై వాసులు కఠినమైన జీవితాన్ని గడుపుతున్నారు.చైనా దేశంలోని షాంఘై నగరం కరోనా వ్యాప్తికి హాట్ స్పాట్ గా మారింది. దీంతో నగరంలోని 26 మిలియన్ల మంది నివాసితులు ఇళ్లకే పరిమితం అయ్యారు.జంటలు కలిసి నిద్రించవద్దు, కౌగిలింతలు,ముద్దులు పెట్టుకోవద్దుకొవిడ్ ప్రబలకుండా పరిమితులు పాటించాలని కోరుతూ డ్రోన్లు తిరుగుతున్నాయి.ఇంటి కిటికీలను కూడా తెరవవద్దని కోరారు.'ఈ రాత్రి నుంచి జంటలు విడివిడిగా పడుకోవాలి, ముద్దు పెట్టుకోవద్దు, కౌగిలింతలు అనుమతించం, విడిగా తినాలి. ఆంక్షలు పాటిస్తున్నందుకు ధన్యవాదాలు'అని ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు హౌసింగ్ సొసైటీ నివాసితులకు చెప్పారు. షాంఘై వీధుల్లో నాలుగు కాళ్ల రోబోలు గస్తీ తిరుగుతూ ఆరోగ్య ప్రకటనలు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో కనిపించాయి.

### వరి కంకులను చేత పట్టి నిరసన తెలిపిన మంత్రి సబిత

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో పండించిన వరి పంటను కొనాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో చేపట్టిన మహా ధర్నాలో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొంటున్నారు. నిరసన కార్యక్రమంలో సబితా వరి కంకులను చేత పట్టుకోని నిరసన తెలిపారు. వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అధ్యక్షతన జరుగుతున్న మహా ధర్నాలో జడ్పీ చైర్ పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, పట్నం నరేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, పైలట్ రోహిత్ రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ విజయ్ కుమార్, జిల్లాలోని ఎంపిపిలు, జడ్పిటిసిలు, మునిసిపల్, మార్కెట్, సొసైటీల చైర్మన్లు, పార్టీ అధ్యక్షులు, సర్పంచ్లు, ఎంపిటిసిలు, రైతు బంధు నేతలు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇక్కడి రైతులపై కక్ష కట్టింది. ఇందులో భాగంగా యాసంగి వడ్లను కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తున్నది. కేంద్ర మంత్రి గోయల్ రాష్ట్ర ప్రజలను అవమానించేలా నూకలు తినడం అలవాటు చేయమని చెప్పడం ఆయన అహంకారం ధోరణికి నిదర్శనం అని మంత్రి సబిత అన్నారు. ఇతర రాష్ట్రాల్లో రెండు పంటలు కొనుగోలు చేస్తున్న కేంద్రం, తెలంగాణ విషయంలో అన్యాయం చేస్తున్నది. రైతులను వరి సాగు చేయాలని చెప్పిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దమ్ముంటే కేంద్రం చేత వడ్లు కొనుగోలు చేయించాలి. వడ్ల కొనుగోళ్ల విషయంలో కేంద్ర మంత్రి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు. బాయిల్డ్ రైస్‌ను విదేశాలకు ఎగుమతి చేస్తూ ఈ బియ్యం ఎవరూ కొనడం లేదని దగాకోరు మాటలు మాట్లాడుతున్నారు. కేంద్రం మెడలు వంచి వడ్లను కొనిపిస్తామని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ వడ్లను కొనబోమని కేంద్రం చెప్తున్నది. తెలంగాణ రైతులు ఈ దేశంలో లేరా? అని అన్నారు. అన్నదాతల కోసం రాజీలేని పోరాటం చేస్తాం. ధాన్యం కొనుగోలులో కేంద్రం పంజాబ్‌లో ఒకలా, తెలంగాణలో మరోలా వ్యవహరిస్తున్నది. సీఎం కేసీఆర్ పెట్టుబడి సాయం, 24 గంటల ఉచిత విద్యుత్తు, సాగునీరు అందించడంతో రైతులు పండించిన పంటను తీసుకోకుండా, కేంద్రం రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నది. 20 ఏండ్లుగా ఎట్లా కొంటున్నరో ఈ సారి కూడా అలాగే కొనాలని అన్నారు.

### ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీష్

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ ప్రజలందరికీ ప్రపంచ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రపంచ స్థాయి, అందరికీ అందుబాటులోఉండే ఆరోగ్య మౌలిక సదుపాయాలను కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. తెలంగాణను గ్లోబల్ మెడికల్ హబ్‌గా మార్చిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## తిమ్మాపూర్ ప్లాంట్‌లో కోకాకోలా 600 కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి..)

లభిస్తుందన్నారు. కోకాకోలా కంపెనీ భవిష్యత్‌లో మరో రూ. 400 కోట్ల పెట్టుబడులు పెట్టనుందని తెలిపారు. కంపెనీ మహిళలకు 50 శాతానికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. స్థానికంగా దొరికే వనరులు వాడుకోవాలని కంపెనీకి సూచిస్తున్నాం. ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలు సమస్యగా మారాయన్నారు. పర్యావరణహితమైన వాటిని వినియోగించాలని సంస్థను కోరుతున్నామని చెప్పారు. ప్యాకేజింగ్ రంగంలోనూ హైదరాబాద్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి కంపెనీలకు తెలంగాణ కేంద్రం అవుతోందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.

### ఈడీ కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ

(మొదటి పేజీ తరువాయి..)ఆదేశించి నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఈడీ సీఎస్ సోమేశ్ కుమార్, ఎక్సైజ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌కు కోర్టు ధిక్కరణ శిక్ష విధించాలని ఈడీ తెలిపింది. ఈడీ కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణను ఈనెల 25కి వాయిదా వేసింది.

### ఎంఐఎం కార్పోరేటర్ తప్పు లేదన్న ఎసిపి

(మొదటి పేజీ తరువాయి..)ప్రేయర్స్ జరుగుతున్నాయని.. అందుకే పార్కింగ్ సమస్య వచ్చిందన్నారు. ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించడమనేదే లేదన్నారు. సమస్య క్లియర్ అయిందని.. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి సమస్య క్లియర్ చేశామని ఏసీపీ ఆనంద్ తెలిపారు.

# తిమ్మాపూర్ ప్లాంట్‌లో కోకాకోలా 600 కోట్ల పెట్టుబడులు

## ప్రభుత్వంతో ఒప్పందం సందర్భంగా మంత్రి కెటిఆర్ వెల్లడి






**సిద్దిపేట, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** కోకాకోలా సంస్థ గురించి కొత్తగా చెప్పనక్కర్లేదని, 25 ఏండ్లుగా మంచి సేవలందిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా తిమ్మాపూర్‌లో రూ. 600 కోట్ల పెట్టుబడులు పెట్టడం సంతోషంగా ఉందని కేటీఆర్ తెలిపారు. నూతన పరిశ్రమ కోసం ఇక్కడ 48.53 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. మంత్రి కేటీఆర్ సమక్షంలో హిందుస్థాన్ కోకాకోలా బేవరేజస్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం గురువారం నాలుగు ఒప్పందాలను కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేయబోయే కొత్త పరిశ్రమ ద్వారా 10 వేల మందికి ఉపాధి మిగతా 2వ

## భారతీయ జనతా పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ములుగు, జిల్లా ఏప్రిల్ 06 (అక్షర వెలుగు):** ఏటూరునాగారం మండల కేంద్రంలో మండల అధ్యక్షులు గండేపల్లి సత్యం ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి దీనిలో భాగంగా మండల అధ్యక్షులు గండేపల్లి సత్యం పార్టీ జెండా ఎగరవేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మానుకోట మాజీ జిల్లా అధ్యక్షులు యాప సీతయ్య మరియు గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణ హాజరై నారు వీరితో పాటుగా గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు జబ్బా సమ్మయ్య గారు భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అల్లే జనార్దన్ గారు దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు కావిరి అర్జున్ గారు మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎండి యాకుబ్ పాషా గారు మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈకమహాలక్ష్మి గారు దళిత మోర్చా మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గద్దల రఘు గారు ఎస్.కె నాగుల్ మీరా గారు గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి పోదేం రవీందర్ గారు కాక నర్సింగరావు గారు గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి ఏటూరు నాగారం మండల ప్రధాన కార్యదర్శి గద్దల హరిబాబు గారు వావిలాల జనార్ధన్ గారు కిసాన్మోర్చా మండల ప్రధాన కార్యదర్శి ఎలుక పల్లి శ్రీనివాస్ గారు మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు వట్టం అమృత గారు ఏటూరునాగారం మహిళా మోర్చా మండల ఉపాధ్యక్షురాలు ఆత్కూరి ప్రేమలత కార్యదర్శి గండేపల్లి రజిని మండల మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కంకణాల నిర్మల బూత్ కమిటీ అధ్యక్షులు బండి శ్రీకాంత్ గారు తదితరులు పాల్గొన్నారు

## ఇంటి స్థలం నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఇవ్వాలని అశ్వాపురం లో ప్రజాపంతా ధర్నా




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్7 (అక్షర వెలుగు):** కేసీఆర్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఖాళీ స్థలాలు ఉన్న నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహకారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ ప్రజాపంతా రాష్ట్ర కమిటీ పిలుపు లో భాగంగా మణుగూరు సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అశ్వాపురం మండలం ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి ఆ పార్టీ మణుగూరు సబ్ డివిజన్ కమిటీ నాయకులు ఎండీ గౌస్ మాట్లాడుతూ మార్కెట్లో ఇంటి నిర్మాణానికి కావలసిన ధరలు విపరీతంగా పెరిగినందున అర్హులైన ఖాళీ స్థలాలు కలిగిన నిరుపేదల అందరికీ ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ఆర్థిక సహకారం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు చూపించి ఇల్లు కట్టి ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, అర్హులైన వారందరికీ ఆసరా పింఛన్లు ఇవ్వాలని, రేషన్ కార్డు లేని వారికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సాగు లో ఉన్న పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, ఇప్పటికే ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న పోడు భూముల ను తిరిగి గిరిజన, గిరిజనేతర పేదలకు అప్పజెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో మునుముందు మరింతగా ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ వెంకటేశ్వర్లు, బండి రాజు, కోలా రామారావు, వెంకటాచారి, స్వప్న, శేషమ్మ, సాయిని రవి, అలవాల లక్ష్మి,కిట్టమ్మ, చిలువేరు చంద్రయ్య, సాయిని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన పినపాక ఎమ్మెల్యే రేగా



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో సీఎం కేసీఆర్ గారు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ గారి ఆదేశాల మేరకు జిల్లా టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ దీక్ష కార్యక్రమం అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు గారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు, టిఆర్ఎస్ పార్టీ బృందం, జిల్లా కలెక్టర్ శ్రీ దురిశెట్టి అనుదీప్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది.

## అక్రమంగా నిల్వ చేసిన 45 క్వింటాళ్ళ పిడిఎస్ రైస్ పట్టుకున్న గోదావరిఖని 2 టౌన్ టాస్క్ ఫోర్స్



**పెద్దపల్లి, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** రామగుండము పోలీస్ కమీషనర్ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు గోదావరిఖని 2టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పెద్దంపేటలో కొంతమంది వ్యక్తులు పిడియస్ రైస్ చుట్టప్రక్కల గ్రామాల నుండి తక్కువ ధరలకు కొనుగోలు చేసి అక్రమంగా తాండ్ర అర్జున్ పెద్దంపేట్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచి అక్రమ రవాణా అనే నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్సు సిఐ రాజ్ కుమార్, గోదావరిఖని 2 టౌన్ ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్,పిఎస్ సిబ్బందితో కలిసి తనిఖీ లు నిర్వహించగా అర్జున్ ఇంటి వద్ద నిల్వ ఉంచిన 90 బియ్యం బస్తాలు 45 క్వింటాళ్లు పిడియస్ రైస్ , రవాణా కి ఉపయోగించిన 4 ఆటో ట్రాలీ లు స్వాధీన పరుచుకొని ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఎ వన్‌గా తాండ్ర అర్జున్, ఏ టూ పర్వతం వెంకటేష్ ఏ త్రీ పస్తం సమ్మయ్య, ఏ ఫోర్‌గా చింతల చిన్న, పర్వతం ప్రశాంత్‌లను నిందితులుగా గుర్తించిన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ టాస్క్‌లో ఎస్ఐ శ్యామ్ పటేల్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది మహేందర్, ప్రకాష్, సునీల్,మల్లేష్ పాల్గొన్నారు.

## ప్రైవేటు వాహనాలకు ఏర్పాటు చేసుకున్న సైరన్లను తొలగించాలి

### కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ




**కరీంనగర్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** వివిధ రకాల ప్రైవేటు వాహనాల కు ఎలాంటి అనుమతులు లేకుండా అత్యవసర సేవల సందర్భంగా వినియోగించే సైరళ్లను ఏర్పాటు చేసిన వాహనదారులు ఈనెల 10లోపు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ అన్నారు. సైరన్లను తొలగించని వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనరేట్ లోని వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల ప్రైవేటు వాహనాలకు అత్యవసర సేవల సందర్భంగా వినియోగించే సైరన్లను చట్టవిరుద్ధంగా ఏర్పాటుచేసి వినియోగిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, సదరు వాహనదారులు వెంటనే తొలగించారని తెలిపారు. ఈ నెల 11 నుండి కమిషనరేట్ వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ లను నిర్వహించి చట్టవిరుద్ధంగా సైరన్లను ఏర్పాటు చేయబడిన వాహనాలను సీజ్ చేయడంతో పాటు సదరు వాహనదారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## శ్రీలంకను ఆదుకుంటున్న భారత్

### కష్టాల్లో ఆదుకున్న మాపెద్దన్న ఇండియానే

### ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలిపిన సనత్ జయసూర్య



**కొలంబో, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** శ్రీలంకలో ఆర్థిక, ఆహార సంక్షోభం కొనసాగుతున్న వేళ భారత్ అందిస్తున్న సాయం మరువలేనిదని శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య అన్నారు. తమదేశంలో నిత్యవసర ధరలు చుక్కలనంటుతున్నాయి. ఏ వస్తువు కొనాలన్నా వందల్లో, వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై లంకేయులు ఆందోళనలకు దిగారు. రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. ప్రస్తుతం లంకలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంకకు భారత్ తన వంతు సాయం అందిస్తోంది. ఇప్పటికే భారీ స్థాయిలో బియ్యం, డిజిల్, మందులను శ్రీలంకకు భారత్ సరఫరా చేసింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ తమ దేశానికి చేస్తున్న ఈ సాయంపై శ్రీలంక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కష్టకాలంలో తమకు సాయం చేసిందుకు భారత్‌కు, ప్రధాని మోదీకి శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జయసూర్య మాట్లాడుతూ.. భారత్ ఎల్లప్పుడూ తమ దేశానికి సహాయం చేస్తూనే ఉందని ప్రశంసించారు. మా పెద్దన్న ఇండియానే అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో పాటు ఇతర దేశాల సాయంతోనే సమస్యల నుంచి శ్రీలంక బయటపడుతుందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందించకుంటే రానున్న రోజుల్లో పెను విపత్తును ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో శ్రీలంకలో బతకడం అంత ఈజీ కాదని షాకింగ్ కామెంట్స్ చేశారు. విద్యుత్ సరఫరా లేకపోవడం, ఆహార కొరత, పెట్రోల్, డీజిల్ కొరత వల్ల లంకేయులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని అన్నారు.

## గోయల్‌కు బలుపు.. కండకావరం

(మొదటి పేజీ తరువాయి..)బలుపు, కండకావరం అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. ధాన్యం సేకరణ విషయంలో కేంద్ర నిర్లక్ష్యపూరిత వైఖరిని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల కేంద్రంలో టీఆర్ఎస్ చేపట్టిన నిరసన దీక్షలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. బీజేపీ పార్టీకి చెందిన గల్లీ నాయకులు ఒక మాట, ఢిల్లీ నాయకులు ఒక మాట మాట్లాడి రైతుల్లో అయోమయాన్ని సృష్టించారు. ధాన్యం సేకరణ విషయంలో ఎవరిది తెలివి తక్కువతనం.. మీ కేంద్రానిదా? తెలంగాణ రైతులదా? అని కేటీఆర్ నిలదీశారు. బీజేపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టడం ఖాయమన్నారు. నూకలు తినమని చెప్పిన పార్టీకి తోకలు కత్తిరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం రైతులను వంచిస్తున్నదని కేటీఆర్ విరుచుకుపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో రైతులు సంతోషంగా ఉన్నారు. ఎండకాలంలో మనం పండించే వరి పంటను కొనాలని అడిగితే.. కేంద్రం నుంచి ఉలుకు పలుకు లేదు. మీ బియ్యం తినమని పీయూష్ గోయల్ అంటున్నాడు. నూకలు తినడం నేర్పించండని వెటకారంగా మాట్లాడిండు. ఎనిమిదేండ్లలో సిలిండర్ ధరలు పెరిగిపోయాయి. సిలిండర్ వెయ్యి అయింది.. మళ్లీ కట్టెల పొయ్యి దిక్కైంది అని కేటీఆర్ విమర్శించారు. మోదీ పాలనలో సామాన్యుల జీవన స్థితిగతులు మారలేదు. చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని మోదీ నాడు డిమాండ్ చేశారు. ఎనిమి దేండ్ల కిందట క్రూడ్ ఆయిల్ ధర 105 డాలర్లు మాత్రమే. ఈరోజు కూడా క్రూడాయిల్ ధర అంతే ఉంది. కానీ ఆ రోజు పెట్రోల్ ధర రూ. 70.51 పైసలు, డీజిల్ ధర రూ. 53.78 పైసలు ఉండే. కానీ ఈరోజు ముడి చమురు ధర మారలేదు. కానీ పెట్రోల్ ధర రూ. 120కి, డీజిల్ ధర రూ. 104కు చేరుకుంది. ఇది ఎవరి చేతకాని తనమో ఆలోచించాలి. సామాన్య ప్రజల నడ్డి విరుగుతున్నా.. మోదీకి మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రజలను నమ్మించి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన మోదీ ఇప్పుడు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమలో ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ తదితరులు పాల్గగొన్నారు.

## శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ వెన్ రెడ్డి రాజు



**చౌటుప్పల్, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో, గాంధీ పార్క్‌లో సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ వెన్ రెడ్డి రాజు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. గాంధీ పార్క్ లో ఏర్పాట్లనును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లో వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం రామాలయం గుడి చైర్మన్ దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, నాయకులు తాడూరి పరమేశ్, మునుకుంట్ల సత్యనారాయణ, జై శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## జ్యోతి బాపులే జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలి

### బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గణం నర్సింహ్మా కురుమ



**నారాయణపురం, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** ఈ నెల 11న సామాజిక విప్లవ కారుడు సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం సంస్థాన్ నారాయణపురం మండల అధ్యక్షుడు గణం నర్సింహ్మా కురుమ గారు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 8 సంత్సరాలు అయినప్పటికీ హైదరాబాద్ లో ఇప్పటి వరకు జ్యోతిరావు పూలే విగ్రహం పెట్టలేదని అన్నారు. దేశంలో ని 60 కోట్ల మంది బిసిలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బిసిలను అవమానిస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయులను గౌరవించే విషయం లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నారు ఇది చాలా అన్యాయం. ఎప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి ఏప్రిల్ 11న సెలవు దినం గా ప్రకటించి జ్యోతిరావు పూలే జయంతి వర్ధంతి లను ప్రభుత్వంమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## పోడు భూముల సమస్యను పరిష్కరించి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి!

- ఏప్రిల్ 9న పాల్వంచలో ప్రదర్శన, సదస్సును విజయవంతం చేయాలి!
- ములకలపల్లిలో న్యూడెమోక్రసీ ప్రచారం




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** గురువారం ములకలపల్లి మండలం లో పోడుభూముల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పథకాలు అందరికీ అమలు చేయాలని కోరుతూ విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమంలో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కొత్తగూడెం డివిజన్ నాయకులు కామ్రేడ్ మోరా రవి పిలుపునిచ్చారు. మండలంలోని చాపరాలపల్లి , గుట్టగూడెం, పూసుగూడెం , సీతారాంపురం, చింతలపాడు, అన్నారం, గుర్రాలకుంట, ధర్మన్న నగర్, అన్నారం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ములకలపల్లి మండల నాయకులు తిరుపతన్న అధ్యక్షతన జరిగిన ప్రచార సభలో కామ్రేడ్ మోరా రవి ప్రసంగిస్తూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి పెట్రోల్ , డీజిల్ రేట్లు , నిత్యావసర సరుకుల ధరలు పెంచి ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు తప్ప, ప్రజా సమస్యలు పరిష్కరించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సంభవించిన కష్ట కాలంలో, ప్రజలపై బస్ చార్జీలు,, రైల్వే ఛార్జీలు పెంచి భారం మోపారని ఆయన అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతంలో అడవి గ్రామాల్లో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ పథకాలు ఆదివాసుల వరకు చేరడం లేదని తెలిపారు. రెండు దశాబ్దాలకు పైగా ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూములను ఫారెస్ట్ అధికారులు బలవంతంగా గుంజుకున్నా ఉన్నారని పేర్కొన్నారు. ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా వాళ్ళని బయటి వారిగా చూస్తున్నారని ఆయన అన్నారు. దేశంలోని 10 రాష్ట్రాల్లో ఉన్నటువంటి ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు సమాన హక్కులు వర్తిస్తాయని తెలిపారు. ప్రభుత్వ పన్నులు వసూలు చేస్తున్న వారి నుండి కనీసం వారి గ్రామాలలో సౌకర్యాలు కల్పించకపోవడం దారుణం అన్నారు. అడవిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న ఆదివాసీల పోడు భూములను గుంజుకుని గెంటి వేయాలని చూస్తున్నారని ఇది రాజ్యాంగ వ్యతిరేకం చట్టవ్యతిరేకం అన్నారు. చదువుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వాలని గ్రామాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదివాసులకు రక్షణ కల్పించాలని సమస్యలు పరిష్కరించాలని, ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల తొమ్మిదో తారీఖున పాల్వంచలో భారీ ప్రదర్శన , సదస్సు నిర్వహించడం జరుగుతుందని, కావున ప్రజలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐయప్టియు జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరావు, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా కోశాధికారి జక్కుల రాంబాబు, ముక్తి జోగయ్య , మడకం దేవయ్య , బాడిస సురేష్ , మడకం బండి తదితరులు పాల్గొన్నారు.

## పెరిగిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ నిత్యవసర సరుకులు వెంటనే తగ్గించాలి వరి ధాన్యం వెంటనే కొనాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఆయన డిమాండు చేశారు

### పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్7 (అక్షర వెలుగు):** పినపాక మండల కాంగ్రెస్ పార్టీ బయ్యారం అడ్డరోడ్డు కార్యాలయంలో అధ్యక్షుడు గొడిశాల రామనాథం మాట్లాడుతూ ప్రజలు రోజురోజుకు పెరిగే నిత్యావసర సరుకులు కొనే పరిస్థితి లేదు అని కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లు పెంచిన అందువలన సామాన్య ప్రజలు వాహనాలు తిప్పే పరిస్థితిలో లేరు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు కెసిఆర్ కు తెలవదా కెసిఆర్ 2018 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత కరెంటు ఇస్తాను అని హామీలు ఇచ్చినారు. ఆ హామీలను తుంగలో తొక్కినారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి కట్టవలసిన కరెంటు బిల్లులను ప్రతి నెల ఎలా కట్టాలి అని ప్రజలకు సూచించడం వారిపై భారం పడుతుందని ఆయన అన్నారు. మండలంలోని మారుమూల ప్రాంతమైన గడ్డంపల్లి గ్రామంలో సోలం సత్యం అనే రైతు కూలీ ప్రతి నెల రెండు వేల బిల్లు వస్తుందని నా కుటుంబం సాగే పరిస్థితి లేదు ఈ నెల కరెంటు బిల్లు రెండు వేల రూపాయలు ఎలా కట్టాలి అని అతను మొర పెట్టుకున్నాడు. సీఎం కేసీఆర్ పరిస్థితులను పక్కదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అన్నారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనాలని ఆయన డిమాండ్ చేసారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ వరి ధాన్యాన్ని కొని కేంద్రానికి సరఫరా చేయించాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలు నమ్మించే పనిలో నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు చేస్తుంటే ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రభుత్వంలో ఉన్న ప్రజాప్రతినిధులే రిలే నిరాహార దీక్షలు చేయడం సిగ్గుచేటని ఆయన అన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిఆర్ఎస్, బిజెపికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని ఆయన అన్నారు. బిజెపి, టిఆర్ఎస్ పార్టీలు తోడు దొంగలని ప్రజలను మోసం చేయడంలో సిద్ధహస్తులని ఆయన అన్నారు.

### మణుగూరు పివి కాలనీ సంత 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా

## వేడుకలు నిర్వహించిన కాలనీ వెల్ఫేర్ కమిటీ

### ముఖ్య అతిథిగా పాల్గొన్న గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు వి ప్రభాకర్ రావు




**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 7 (అక్షర వెలుగు):** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా పివి కాలనీ సంత (అంగడి) ప్రారంభించి 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం సాయంత్రం కాలనీ వెల్ఫేర్, సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో సంతలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు ఐ.ఎఫ్.టి.యు విజ్ఞప్తి మేరకు 2002 ఏప్రిల్ మొదటి వారంలో పీవీ కాలనీలో సంత ఏర్పాటు నాటి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ మాజీ డైరెక్టర్ పరిటాల వాసు దేవరావు గారు ఎంతగానో సహకారం అందించారని ఏ నాటికి కాలనీవాసులు ఆయన్ని మర్చిపోరన్నారు ఐ ఎఫ్ టి యు ఆలోచనకు కాలనీ వెల్ఫేర్ కమిటీ తోడ్పాటు గుర్తింపు సంఘం తో పాటు అన్ని కార్మిక సంఘాల సహకారం కూడా తోడై ఆయా పరిస్థితులకు అనుగుణంగా కాలనీలోనే సంత మూడు చోట్లకు మారినప్పటికీ ఇటీవల సంతలో పశువుల సంచార ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గుర్తింపు సంఘం (తెలంగాణ బొగ్గు గని కార్మిక సంగం ) చొరవతో ఇంతక ముందు మరుగు దొడ్లు నిర్మాణం మరలా వారి చొరవతో తాజాగా సింగరేణి యాజమాన్యం ప్రత్యేకించి జిఎం జక్కం రమేష్ గారు నిధులు కేటాయించి సంత చుట్టూ అవరణ అభివృద్ధి పనులు చేపట్టడం లైటింగ్(వెలుతురు ) లాంటి అభివృద్ధి పనులు చేయడం అభినందనీయమని సంత ఏర్పాటుకు ఆలోచన చేసిన ఐ ఎఫ్ టి యు నాయకులు కాలనీ సంక్షేమ కమిటీ సభ్యులు నా సర్ పాషా నాటి తమ అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఏరియా గుర్తింపు సంఘం ఉపాధ్యక్షులు కాలనీ సంక్షేమ కమిటీ ప్రధాన కార్యదర్శి వి. ప్రభాకర్ రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, కాలనీవాసులు కూరగాయలు పండ్లు ఇతర ఏ వస్తువు కొనాలన్నా ఆరు కిలోమీటర్ల దూరంలోని బండారు గూడెం వెళ్లాల్సి వచ్చేదని చిరు వ్యాపారులకు కొనుగోలుదారులకు మధ్య వారధిగా సంత ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు సమీప గ్రామాల గిరిజనులు కూడా తమ అటవీ ఉత్పత్తులను అమ్ముకొని తమకు కావాల్సిన నిత్యవసర వస్తువులు కొనుగోలు చేయడానికి సంత ఎంతో సౌకర్యంగా ఉందన్నారు, ఎలాంటి రుసుము చెల్లించకుండా చిరు వ్యాపారులు వ్యాపారం కొనసాగించటం ఎంతోమందికి సంత ఉపాధి కలిగించటం సంతోష దాయకం అన్నారు,సంత అభివృద్ధికి తమ సంఘం కట్టుబడి వుందని సంత లో ఎండ వానలు తట్టుకునేలా షెడ్స్ నిర్మించాల్సి వుందని అందుకు తగు చర్యలు చేపడతామని ఆయన సభాముఖంగా హామీ ఇచ్చారు వ్యాపారులు కూడా ఇదే స్ఫూర్తితో కొనుగోలుదారులకు పండ్లు కూరగాయలు సరైన ధరలకు అమ్మాలని కోరారు, ఈ కార్య క్రమంలో ఐ ఎఫ్ టి యు నాయకులు, కాలనీ సంక్షేమ కమిటీ సభ్యులు యస్ డి. నాసర్ పాషా, నాయకులు కాలనీ సంక్షేమ కమిటీ సభ్యులు చిట్టి వెంకటేశ్వర్ రెడ్డి,వై. ఆనంద బాబు,ఆదినారాయణ, ఏ. మంగీలాల్, మరియు అన్వర్, అజీజ్, సాయి, సాంబ,గోపి,వినయ్ కుమార్, చిరు వ్యాపారులు మైనంపాటి సీతారామిరెడ్డి, రంజిత్,వట్లూరి శంకర్, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సిహెచ్ ప్రసాద్, మధులత, ఫిరోజ్, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.




# చలన చిత్రం




## బర్త్‌డే రోజు ఆర్జీవికి షాక్

### బాకీ పైసలు ఇవ్వడం లేదంటూ నట్టికుమార్ కేసు

వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు పుట్టినరోజు నాడు ఊహించని షాక్ తగిలింది. గురువారం బర్త్‌డే సందర్భంగా అందరూ ఆయనకు విషెస్ చెబుతుంటే, నిర్మాత నట్టికుమార్ మాత్రం ఆర్జీవీపై కేసు వేసి ఆయనకే షాకిచ్చాడు. వివరాల్లోకి వెళ్లితే.. వర్మ నుంచి వస్తోన్న బోల్డ్ మూవీ 'డేంజరస్ తెలుగులో 'మా ఇష్టం' పేరుతో శుక్రవారం విడుదల కావాల్సి ఉంది. అప్సర రాణి, నైనా గంగూలీ ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాను ప్రదర్శించేందుకు ఇప్పటికే కొన్ని థియేటర్స్ నిరాకరించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆర్జీవీ తనకు రూ. 5 కోట్ల 29 లక్షలు ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతున్నారని నిర్మాత నట్టికుమార్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రతి సినిమాకు రూ. 50 లక్షలు ఇవ్వాలన్న నిబంధన్ని వర్మ తుంగలో తొక్కినట్లు ఆరోపించారు. పిటిషన్‌ను విచారించిన కోర్టు ఆర్జీవీ తెరకెక్కించిన మా ఇష్టం చిత్రాన్ని ఆపాలంటూ ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బర్త్‌డేను అందరూ సెలబ్రేట్ చేసుకుంటారు. కానీ ఆయన మాత్రం జీవితంలో ఒక ఏడాది ముగిసిపోయిందని, కాబట్టి ఇది బర్త్‌డే కాదు, డెత్ డే అంటూ విచిత్రంగా మాట్లాడుతుంటాడు సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. ఏప్రిల్ 7 ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా అతడికి ఇష్టమున్నా లేకపోయినా ఫ్యాన్స్ మాత్రం బర్త్‌డే విషెస్ తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖ గేయ రచయిత సిరాశ్రీ ఆర్జీవీని పొగడ్తలతో ముంచెత్తాడు. రాకెట్టుగ దూసుకెళ్లు రాముండితడే అని ఓ పద్యం రాసుకొచ్చాడు. ఇది చూసిన వర్మ అంతా బానే ఉంది కానీ తనను రాముడితో కాకుండా రావణాసురుడితో పోలిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డాడు. అయితే మాటల గారడీ చేసే సిరాశ్రీ.. పద్యాలతో మిమ్మల్ని ఇరిటేట్ చేయడం కన్నా వినోదం ఇంకేముంటుందంటూ మరో పద్యాన్ని సైతం రాసుకొచ్చాడు.

## ఆది మరో సినిమాకు పూజా కార్యాక్రమాలు



యంగ్ హీరో ఆది సాయికుమార్ వరుస సినిమాలతో దూసుకెళ్తున్నాడు. ఇప్పటికే ఆయన నటించిన నాలుగైదు సినిమాలు విడుదలకు సిద్దంగా ఉన్నాయి. తాజాగా ఈ యువ హీరో మరో చిత్రాన్ని లైన్‌లో పెట్టేశాడు. ఆదిత్య మూవీస్ ,ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ సినిమా తెరకెక్కబోతోంది. తెలుగులో ఇప్పటివరకు టచ్ చేయని ఓ వైవిధ్యభరితమైన కథతో ఈ సినిమాను రూపొందించనున్నారు. గురువారం పూజా కార్యక్రమా లతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించారు. కేవీ శ్రీధర్ రెడ్డి నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాకు గిరిధర్ మామిడిపల్లి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తు న్నారు. శశికాంత్ దర్శకత్వం వహిస్తున్నారు.హర్ష వర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు.

## డేంజరస్ చిత్రం విడుదల వాయిదా ట్విట్టర్ వేదికగా ప్రకటించిన ఆర్జీవి

రామ్ గోపాల్ వర్మ తెరకెక్కించిన పాన్ ఇండియా చిత్రం 'డేంజరస్' తెలుగులో 'మా ఇష్టం' విడుదల వాయిదా పడింది. శుక్రవారం విడుదల కావాల్సిన ఈ సినిమాని వాయిదా వేస్తున్నట్లు ట్విటర్ ద్వారా ఆర్జీవీ వెల్లడించారు. 'లెస్బియన్ నేపథ్యం కారణంగా చాలా థియేటర్లు సహకరించకపోవడంతో సినిమా విడుదల పోస్ట్ పోన్ చేస్తున్నాం. అన్ని విధాలుగా ఈ అన్యాయంని ఎలా ఎదుర్కోవాలో పరిశీలించి తగు చర్యలు తీసుకున్నా తరువాత మరో విడుదల తేదీ తెలియజేస్తాను'అని ఆర్జీవీ ట్వీట్ చేశాడు. మరోవైపు ఆర్జీవీ 'మా ఇష్టం' సినిమా విడుదలను వాయిదా వేయాలని నిర్మాత నట్టి కుమార్ సివిల్ కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తనకు 5 కోట్ల 29 లక్షలు ఇవ్వాలని, ఇవ్వాల్సిన ఇవ్వకుండా తప్పించుకుంటున్నాడ నిర్మాత నట్టి కుమార్ కోర్ట్ లో పిటిషన్ వేశారు. దీంతో 'మా ఇష్టం' సినిమా రిలీజ్ ను ఆపాలని సిటీ సివిల్ కోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. ఇలా వరుస వివాదాలు చుట్టుముట్టడంతో సినిమాను వాయిదా వేస్తున్నట్లు ఆర్జీవీ ప్రకటించాడు. రామ్ గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'డేంజరస్'. అప్సర రాణి, నైనా గంగూలీ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం తెలుగులో 'మా ఇష్టం'పేరుతో విడుదల కాబోతోంది. ఇద్దరమ్మాయిల మధ్య కలిగిన ప్రేమ ఎలాంటి పరిస్థితులకి దారి తీసింది.. అనే థ్రిల్లింగ్ అంశాలతో క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.




## ఆచార్య విడుదలకు సన్నాహాలు



మెగాస్టార్ చిరంజీవి తాజా చిత్రం 'ఆచార్య' ఈనెల 29న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లో విడుదల కాబోతోంది. త్వరలోనే సినిమా ట్రైలర్ రాబోతోంది. అలాగే ప్రీరిలీజ్ ఈవెంట్ కూడా గ్రాండ్ గా జరగబోతోంది. ఇదిలా ఉంటే.. చిరంజీవి తదుపరి చిత్రానికి సైతం రిలీజ్ డేట్ లాక్ అయిందనే వార్తలొస్తున్నాయి. తమిళ దర్శకుడు మోహన్ రాజా తెరకెక్కిస్తున్న ఈ సినిమా మలయాళం సూపర్ హిట్ 'లూసిఫర్' చిత్రానికి అఫీషియల్ రీమేక్ అన్న సంగతి తెలిసిందే. నయనతార, సత్యదేవ్ కీలక పాత్రలు పోషిస్తుండగా.. బాలీవుడ్ భాయీజాన్ సల్మాన్ ఖాన్ సైతం ఇందులో అతి ముఖ్యమైన పాత్ర చేస్తున్నాడు. ఆల్రెడీ సల్మాన్ ఖాన్ సన్నివేశాల చిత్రీకరణ పూర్తయింది. ఇప్పటికే 70 శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం ముంబైలో షూటింగ్ జరుపుకుంటోంది. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను ఆగస్ట్ 11న విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. వరుసగా శెలవులు ఉండడం వల్లనే 'గాడ్‌ఫాదర్' చిత్రానికి ఆ డేట్ ను సెట్ చేశారని టాక్. ఇదే తేదీన అఖిల్ 'ఏజెంట్', సమంత 'యశోద', అమీర్ ఖాన్ 'లాల్‌సింగ్ ఛద్దా' విడుదల కాబోతున్నాయి. మరి చిరు సినిమా అదే డేట్లో విడుదలవుతుందా.. లేక ఆయన పుట్టిన రోజునాడు విడుదలవుతుందా అనే సంగతి తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.



## ఓవర్సీస్‌లోనూ ఆర్ఆర్ఆర్ కలెక్షన్ల దుమ్ము

యంగ్ టైగర్ యన్టీఆర్, మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోలుగా దర్శకధీరుడు రాజమౌళి మలిచిన పాన్ ఇండియా చిత్రం 'ఆర్.ఆర్.ఆర్' ఏ స్థాయి విజయాన్ని అందుకుందో తెలిసిందే. తెలుగుతో పాటు విడుదలైన అన్ని భాషల్లోనూ రికార్డు వసూళ్ళు నమోదు చేయడమే కాకుండా.. ఓవర్సీస్ లోనూ కళ్ళు చెదిరే రీతిలో కలెక్షన్స్ రాబట్టింది. ఇప్పటి వరకూ ప్రపంచ వ్యాప్తంగా దాదాపు రూ. 900 కోట్లకు పైగానే వసూళ్ళు నమోదు చేసిన ఈ సినిమా త్వరలోనే రూ. 1000 కోట్ల బెంచ్ మార్కును టచ్ చేయబోతోంది. రాజమౌళి దర్శకత్వ ప్రతిభ, తారక్, చెర్రీల అభినయ విన్యాసం, పాటలు, గ్రాఫిక్స్ మాయాజాలం.. ఆడియన్స్ ను పదే పదే థియేటర్స్ కు రప్పిస్తున్నాయి. అయితే ఈ భారీ చిత్రానికి బాలీవుడ్ బెల్ట్ లోనూ రికార్డు కలెక్షన్స్ రావడం విశేషం. బాలీవుడ్‌లో స్ట్రెయిట్ మూవీస్ ను సైతం తొక్కుకుంటూ.. ముందు నుంచీ రికార్డ్ వసూళ్ళు నమోదు చేసిన ఈ సినిమా ఇప్పటి వరకూ దాదాపు రూ. 200 కోట్ల కలెక్షన్స్ ను రాబట్టి సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. బాలీవుడ్ లో ఆ స్థాయిలో వసూళ్ళురాబట్టి తొలి తెలుగు చిత్రంగా తన ప్రత్యేకతను చాటుకుంది 'ఆర్.ఆర్.ఆర్'. లాంగ్‌రన్ లో ఈ సినిమా రూ. 300 కోట్ల వసూళ్ళను అందుకొనే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాల వారు అంటున్నారు. మొత్తం మీద 'ఆర్.ఆర్.ఆర్' చిత్రం బాలీవుడ్ లోనూ బ్రహ్మాండమైన కలెక్షన్స్ రాబట్టి.. సత్తా చాటుకుంది. అక్కడ ఈ రికార్డు బద్దలు కావాలంటే.. మళ్ళీ రాజమౌళి చిత్రమే రావాలి.

## 50 కోట్లకు కెజిఎఫ్-2 నైజాం హక్కులు

### డబ్బింగ్ సినిమాకు ఇంత డిమాండ్ రావడంపై ఆశ్చర్యం



కన్నడ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన చిత్రం 'కేజీఎఫ్'. అప్పటివరకు కన్నడ సినిమాలను ఇతర ఇండస్టీ వాళు అంతగా పట్టించుకునే వారు కాదు. ఆ సమయంలో కేజీఎఫ్ చిత్రం ప్రభంజనం సృష్టించింది. ఎలాంటి అంచనాల్లేకుండా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం విడుదలైన ప్రతి ఏరియాలో వసూళ్ళ సునామిని సృష్టించింది. 'బాహుబలి' తర్వాత ఆ స్థాయిలో 'కేజీఎఫ్' చిత్రం బాలీవుడ్‌లో జెండా పాతింది. అప్పటివరకు ఇండియన్ సినిమాలో అలాంటి ఎలివేషన్‌లు ఎక్కడా చూడలేదు. ప్రశాంత్ నీల్ టేకింగ్‌కు, విజన్‌కు సినీప్రముఖులు సైతం అశ్చర్యంలో పడ్డారు. అప్పటివరకు అసలు మొహం కూడా తెలియని యష్ ఈ చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగాడు. ఈ చిత్రంలో యష్ నటన, డైలాగ్ డెలివరీకి ప్రేక్షకులు బ్రహ్మారథం పట్టారు. 'కేజీఎఫ్' సీక్వెల్ కోసం కన్నడతో పాటు ప్రతి సినీ ప్రేక్షకుడు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ సినిమాగా తెరకెక్కిన 'కేజీఎఫ్ చాప్టర్-2' ఏప్రిల్ 14న ప్రేక్షకులు ముందుకు రానుంది. ఈ క్రమంలో ప్రతి ఏరియాలో ఈ చిత్ర బిజినెస్ భారీ స్థాయిలో జరుగుతుంది.ఈ క్రమంలోనే ఈ చిత్ర నైజాం హక్కులు 50కోట్లకు అమ్ముడయ్యాయట. ఒక డబ్బింగ్ చిత్రానికి ఈ స్థాయిలో బిజినెస్ జరగడమనేది విశేషం అనే చెప్పాలి. కేజిఎఫ్ చాప్టర్-1 రూ.5 కోట్ల బ్రేక్‌ఈవెన్‌తో వచ్చి రూ.12.30 కోట్ల కలెక్షన్లను సాధించి డబుల్ బ్లాక్ బస్టర్‌గా నిలిచింది.హోంబలే సంస్థ నిర్మించిన ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటించింది. ఇప్పటికే చాప్టర్-2 నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్ రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సాధించాయి. తాజాగా ఈ చిత్రం నుంచి విడుదలైన ఎదగరా ఎదగరా సాంగ్‌కు విశేష స్పందన వచ్చింది.



## మీకు తిరుగులేదు దేవర..బండ్ల గణేష్ ట్వీట్

పవన్‌కల్యాణ్‌కు బండ్ల గణెళిశ్ పెద్ద అభిమానే కాదు.. భక్తుడు కూడా. వేదిక దొరకిన ప్రతిసారి పవన్‌పై తనకున్న భక్తిని తెలియజేస్తుంటాడు బండ్ల గణెళిశ్. తాజాగా ఆసక్తికర ట్వీట్ చేసి సోషల్ మీడియాను షేక్ చేశారు. గురువారం ఆయన పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి 'మీకు తిరుగులేదు దేవర' అని ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్వీట్ వైరల్ అవుతోంది. అసలు ట్వీట్‌కి కారణం ఏంటంటే.. పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి. తాజాగా షెడ్యూల్ కోసం శుక్రవారం నుంచి పవన్ సెట్‌లో అడుగుపెట్టారు. చారిత్రక కథతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో పవన్ వజ్రాల దొంగగా కనిపించనున్నట్లు సమాచారం. ఇందులో యాక్షన్ సీన్స్ కోసం పవన్ రిహార్సెల్ చేస్తున్నారు. ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ టోడర్ లాజరోవ్‌తో కలిసి కొన్ని పోరాట సన్నివేశాలు ప్రాక్టీస్ చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను నిర్మాణ సంస్థ విడుదల చేసింది. ఆ ఫొటోలను బండ్ల గణెళిశ్ ట్విట్టర్‌లో షేర్ చేసి 'గన్ను పట్టినా, పెన్ను పట్టినా, కత్తి పట్టినా, మైకు పట్టినా.. ఏది పట్టినా ఎవరిపై గురి పెట్టినా మీకు తిరుగులేదు దేవర' అని రాసుకొచ్చారు. ప్రస్తుతం బండ్ల చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. క్రిష్ దర్శకత్వంలో భారీ బ్జడెట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం నిర్మిస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com